Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 164 | Sunday : 08.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :164 | ఆదివారం 8 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4




# 5 లక్షల మందితో యోగా

- విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు
- ఇందుకు ఏపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు
- గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా ఈవెంట్
- కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం**

జూన్ 21వ తేదీన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఏపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్కడ ఒకేరోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా - మిగతా3లో

# కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుదాం

- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు క్లాస్
- ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలి
- వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దు, పనితీరు మెరుగుపరుచుకోవాలి
- జూన్ 12వ తేదీన అమరావతిలో 2 వేలమందితో ఓ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం
- ఆ తర్వాత కూడా ఏపీవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టాలి
- పార్టీ కార్యకర్తలు, నేతలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కూటమిపై ఎన్నో ఆశలతో ప్రజలు గెలిపించారని.. ఎమ్మెల్యేలు అందరూ అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దని, పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్నిపెంచే విధంగా ఎమ్మెల్యేలు వ్యవహరించాలని కోరారు. శనివారం తెలుగుదేశం కార్యకర్తలు, నేతలు, ఎమ్మెల్యేలతో అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి - మిగతా3లో



# కాళేశ్వరం కొట్టిన దెబ్బ.. ఆనాటి కథలు..

- ఈటెలపై తుమ్మల ఫైర్
- కాళేశ్వరం కమిషన్‌కు ఈటెల అసత్యాల వాంగ్మూలం ఇచ్చారు
- కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈటెల పొంతనలేని సమాధానం ఇచ్చారు
- ఆయన చెప్పిన సబ్ కమిటీ.. కాళేశ్వరం కోసం వేసింది కాదు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఇంటర్నెట్ డెస్క్**

బీజేపీ నేత, హైదరాబాద్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ మాటల్ని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తప్పుబట్టారు. - మిగతా3లో



# మహారాష్ట్ర తరహాలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ
- రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి 2024 మహారాష్ట్ర ఎన్నికలు బ్లూప్రింట్
- ఆ రిగ్గింగ్ ఎలా జరిగిందో ఈ ఆర్టికల్‌లో తెలుస్తుంది
- త్వరలో బీహార్ ఎన్నికల్లో జరుగ బోతోంది
- మ్యాచ్ ఫిక్స్ ఎన్నికలు ఏ ప్రజాస్వామ్య దేశానికైనా విషం లాంటిది



# ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలాన్ మస్క్

- కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు యోచన
- అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు
- ఇటీవలే డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్..



# ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోలు మృతి
- తెలుగు నేతలే టార్గెట్‌గా ఆపరేషన్
- ఘటన స్థలంలో రెండు ఏకే 47 రైఫిళ్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మృతి

# ఆందోళనకరంగా ఏపీ ఆర్థిక పరిస్థితి

- కాగ్ లెక్కలతో వైఎస్ జగన్ ట్వీట్
- కూటమి ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయి
- 2024 ఏప్రిల్‌తో పోల్చితే 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆదాయం ఏకంగా 24.20 శాతం తగ్గింది.
- ఈ వాస్తవాలను కాగ్ నివేదిక బయట పెట్టగానే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించింది.
- ఏప్రిల్ విషయాలు చెప్పకుండా మే నెలలో జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో పెరుగుతాయంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది






# తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దు

- 500 రూపాయల నోట్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం లేదు
- ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి
- వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది’

# జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూల్‌లలో 50 శాతం రాయితీ

## ఏపీయూడబ్ల్యూజే నేతలకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ



**తిరుపతి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**
తిరుపతి జిల్లాలోని అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( ఏపీయూడబ్ల్యూజే) తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి నరేంద్ర ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ విషయమై వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డీఈఓ, ఆర్ఐఓలకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్‌కి ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ వై కోటేశ్వరబాబు, జిల్లా సహాయ కార్యదర్శి తారక, జర్నలిస్టులు సురేష్, పురుషోత్తం, విసి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ పండుగను జరుపుకున్న ముస్లింలు







**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**
కుప్పం నియోజకవర్గంలో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అత్తరు పూసిన దుస్తులు ధరించి ఆ సువాసనలతో మసీదుకు వెళ్లి ముస్లిం సోదరులందరూ కలసి," అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్,లా ఇలాహా ఇల్లల్లాహు అల్లాహు అక్బర్,అల్లాహు అక్బర్ వలిల్లా ఇల్హాం" అంటూ తక్బీర్ పఠిస్తూ ఈద్గాకు చేరుకు న్నారు. అనంతరం రెండు రకాత్‌ల "ఈదుల్ అజాహ్"వాజిబ్ నమాజ్ చదివారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ఇమామ్ బక్రీద్ పండుగ ప్రాశస్త్యం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రపంచ మానవాళికి శుభం కలగాలని (దువా) ప్రార్థించారు.అనంతరం ఒకరి కొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ పండుగలో అత్యంతప్రాసస్థ్యం కలిగిన ఖుర్బానీని పేదలకు పంచిపెట్టారు.కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈపండుగను నిర్వహించారు. కాగా బక్రీద్ పండుగను పురస్కరిం చుకుని కుప్పం మండలంలోని పార్టీ సీనియర్ నేతలు పిఎస్ మునిరత్నం, డాక్టర్ బిఆర్ సురేష్ బాబు, రాజ్ కుమార్, గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, జాకీర్, కణ్ణన్, అన్సర్, ఇమ్రాన్, గని, (అప్పు) ముఖేష్, తదితరులు ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

# సాయి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థుల విజయకేతనం

**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్07:**




శనివారం రోజు విడుదలైన ఇంటర్మీడి యట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఇంప్రూ వ్మెంట్ పరీక్షల ఫలితాలలో సాయి శ్రీచైతన్యకళా శాలవిద్యార్థులు రాష్ట్రస్థా యిర్యాంకులను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా బైపిసి గ్రూపులో హారిక రెడ్డి, ఇక్రా అను ఇద్దరు విద్యార్థినులు (435/ 440) మార్కులను సాధించి రాష్ట్రస్థా యిలో, రెండవ ర్యాంకును, పలమనేర్ అసెంబ్లీ నియోజక వర్గస్థాయిలో, మొదటి స్థానాన్ని, కైవసం చేసుకున్నారు. వీరిద్దరి తర్వాత ఇదే గ్రూపులో తౌఫిక్, శశికళ అను ఇద్దరు (434/ 440) మార్కులు సాధించారు. ఇంకా సీఈసీ గ్రూపులో మనీషా అను విద్యార్థిని(491/ 500) మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమమైన ర్యాంకును సాధించింది. మరియు ఎంపీసీ గ్రూపుకు చెందిన దేవిశ్రీ, జాహ్నవి, అను ఇద్దరు విద్యార్థినిలు (465/470) మార్కులు, ఎంఈసి గ్రూపులో కీర్తి అను విద్యార్థిని(483/ 500) మార్కుల సాధించి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమమైన ర్యాంకును సాధించారు. ఇంకా కళాశాలకు చెందిన చాలామంది విద్యార్థినీ విద్యార్థులు వారికి మార్చి నెలలో వచ్చిన మార్కుల కన్నా ఈసారి ఇంక నూ ఎక్కువ మార్కు లను సాధించారు. ఇంతటి మార్కులను మరియు ఉత్తీర్ణత శాతాన్ని సాధిం చడంలో కృషిచేసిన అధ్యాపకులందరినీ కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందిం చింది. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అన్ని గ్రూపులలోనూ అత్యుత్తమమైన మార్కులు, ఉత్తీర్ణతశాతాన్ని సాధించడమేకాకుండా ప్రతిసారి లాగే ఈసారి కూడా ప్రతిభ అవార్డుల పట్టికలోనూ విద్యార్థులను ఎంపిక అయ్యేలా చేసి పలమనేర్ లాంటి గ్రామీణప్రాంత విద్యార్థులను తమిళనాడు బెంగళూరు, బయట రాష్ట్రాలలో ఉన్న పేరెన్నిక గన్న యూనివర్సిటీలలో సీట్లు సాధించేలా చేసి విద్యార్థుల బంగారు భవి ష్యత్తుకు బాటలు వేస్తున్న సాయిశ్రీ చైతన్య జూనియర్ కళాశాల. గత 11 సంవత్స రాలుగా కళాశాల యాజమాన్యమే అధ్యా పకులుగా స్థాపించిన, ఈ సాయి శ్రీచైతన్య జూనియర్ కళాశాల పైన నమ్మకం ఉంచి మీ పిల్లలను చేర్చివారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకున్న తల్లితండ్రులం దరికీ కళాశాల యాజమాన్యమైన ఎం విఆర్ రెడ్డి, కిషోర్ కుమార్, ప్రమోద్ కుమార్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముఖ్యమంత్రి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించండి

## గుజ్జు పరిశ్రమలను తెరిపించండి
## తోతాపురిని కొనుగోలు చేయించండి
## మామిడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడండి
## జిల్లా అధికారులకు సూచించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు
## ఏపీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేసిన ఎంపీ దగ్గుమళ్ళ



**చిత్తూరు, చిత్తూరుఎక్స్ ప్రెస్, జూన్ 07:**
మామిడి రైతుల సంక్షేమ మేపరమావధిగా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలనిచిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు జిల్లా యంత్రాంగానికి ఓ ప్రకటనలో సూచించారు.గుజ్జు పరిశ్రమలను తెరిపించి, మామిడి రైతుల నుంచి తోతాపురిని కొనుగోలు చేయించి,వారికి నష్టం వాటిల్లకుండా చూడాలని జిల్లా అధికారులకు తెలియజేశారు. తోతాపురి మామిడి టన్నుకు రూ.. 12 వేల రూపాయలు ప్రకటించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి ఎంపీ దగ్గుమళ్ళ ఈ సందర్భంగా కృత జ్ఞతలు తెలియజేశారు. తోతాపురి మామి డికి మద్దతు ధరను 12 వేల రూపాయల గా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని కొనియాడారు. ప్రభుత్వ ఆశయాన్ని అధికారులు పసిగట్టి, పక్వా నికి వచ్చిన మామిడికాయలను మాత్రమే ప్రాసెసింగ్ కంపెనీలకు పంపించే అంశం పై మామిడి రైతులకు అవగాహన కల్పించడంలో హార్టికల్చర్, అగ్రికల్చర్, అసిస్టెంట్లు, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలోని ఏపి గుజ్జు పరిశ్రమలు పనిచేస్తున్నాయనే రోజు వారి వివరాలను డిస్ప్లే చేయించాలని.., కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు దిగుమతి అయ్యే మామిడి రవాణాను రాష్ట్ర సరి హద్దుల వద్ద నిఘా ఏర్పాటు చేసి, నియం త్రించాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. అదే సమయంలో ప్రాసెసింగ్ కంపెనీల వద్ద పరిస్థితిని అధికారులు ఎప్పటి కప్పుడు అంచనావేసి, మామిడి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండాచర్యలు చేపట్టాలని తెలియజేశారు. అంతేకాకుండా మామిడి రైతుల నుంచి గుజ్జు పరిశ్రమలు తోతాపురిని కొనుగోలు చేయించడంతో పాటు, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సూచించిన గైడ్లైన్స్ ప్రకారం, మామిడి రైతుల కు మద్దతు ధరను ఇప్పించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని తెలిపారు. అప్పుడే మామిడి రైతులకు మేలు చేసిన వారి అవుతామని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అభిప్రాయపడ్డారు.

# కరువులోనూ పాడి రైతులను ఆదుకున్న ప్రభుత్వం టీడీపీ

## వ్యవసాయం, పాడి అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు
## ప్రభుత్వపథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
## రైతులకు రాయితీపై దాణాపంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే
## అమర్ పై ఎనలేని అభిమానాన్ని చాటుకున్న వీరప్పల్లి వాసులు
## మొదటిసారి విచ్చేసిన ఎమ్మెల్యేకు అడుగడుగునా హారతులతో స్వాగతం
## పంచాయతీ వాసుల అభిమానానికి ఫిదా అయిన ఎమ్మెల్యే




**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**
కరువులోను పాడి రైతులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని పలమనేరు శాసనసభ్యులు అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పెద్దపంజాణి మండలం కోగిలేరు, వీరప్పల్లి పంచాయతీ కేంద్రాలలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాడి రైతులకు రాయితీపై దాణా పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పాడి రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు... కరువులోను పాడి రైతులకు గడ్డిని సరఫరా చేసి చంద్రబాబు పాడి రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యతను ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గతంలో నిర్వహించిన పథకాలను ఆయన వివరించారు. వ్యవసాయం పాడి అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పలమనేర్ ప్రాంతం చాలా అనుకూలమైనదని మహిళలు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. పాడిని అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం రాయితీ మరియు సబ్సిడీ పథకాలను అమలు చేస్తోందని ఆయన తెలియజేశారు. అనంతరం పలువురు రైతులకు 50 శాతం రాయితీతో దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో తాసిల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో బాలాజీ, వెటర్నరీ డాక్టర్ వినీత మరియు మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, నాయకులు మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజారెడ్డి, సర్పంచ్‌లు రమేష్, పార్వతమ్మ, ఎంపీటీసీ మణి, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, మాజీ ఎంపిటిసి హరి, మైనారిటీ నాయకులు ముబారక్, మరియు వెంకటప్ప, మనోహర, బాబు,వేణు, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పై ఎనలేని అభిమానాన్ని చాటుకున్న వీరప్పల్లి వాసులు



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**
ఇలా ఉండగా ఎన్నికలఅనంతరం తొలి సారి తమ సొంత పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అమర్నాథరెడ్డికి పంచాయతీ వాసులు ఎనలేని అభిమానా న్ని చాటుకున్నారు.వీరప్పల్లి గ్రామస్తులతో పాటు పంచాయతీవాసులు పెద్దఎత్తున స్వాగత ఏర్పాట్లనుచేపట్టారు. ఈ సందర్భంగా ఆయనపై పూలవర్షం కురిపించి అడుగడుగునా నీరాజనాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. పంచాయతీ వాసులు తనపై చూపినఅభిమానానికి ఎమ్మెల్యే సైతం ఫిదా అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జీవితాంతం పంచాయతీ వాసులతోనే ఉంటానని, పంచాయతీ వాసులరు ణాన్ని ఎప్పటికీ మర్చిపోనని భావోద్వేగ ప్రసంగం చేశారు.

# సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసిన టిడిపి నేత మోహన్ మురళి

**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**



రైతులకు సబ్సిడీపై కుటమి ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను మాజీ ఎంపీటీసీ వెదురుకుప్పం టిడిపినేత మోహనమురళి శనివారం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం రైతుభరోసా కేంద్రంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రైతులు పక్షాన ఎప్పుడు నిలిచే ఏకైక వ్యక్తి చంద్రబాబునాయుడు అనిఅన్నారు. గత ప్రభు త్వంలో రైతులకు అందిస్తున్న సబ్సిడిలు పూర్తిగా ఎత్తివేసారని మన కుటుంబం ప్రభుత్వం వచ్చా క రైతులకు సబ్సిడీపరికరాలు నుంచి విత్తనాలువరకు సబ్సిడీలు అందిస్తున్న రైతులు గుండెల్లో చిరస్థాయిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచిపోయారని మోహన్ మురళి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ సిబ్బంది, దయాకర్ వెటర్నరీ సిబ్బంది గణేష్ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# మృతిచెందిన చిన్నారుల కుటుంబకులను పరామర్శించిన ఎమ్మెల్యే



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**
వీ.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లికి చెందిన ముగ్గురు యువకులు మూడ్రోజుల క్రితం చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే....దీంతో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి మండల టీడీపీ నాయకులతో కలసి శనివారం మోట్లపల్లిలో బాధిత కుటుంబీకులను కలసిపరామర్శించారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన తీరును మృతుల కుటుంబీకులు వివరించి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఒకే కుటుంబానికి ముగ్గురు చిన్నారుల మృతి తనను కలచి వేసిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. విధిరాతను ఎవరు తప్పించలేమని ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. పుత్ర శోకాన్ని కలిగించే ఇలాంటి సంఘటనలను గుర్తించి పిల్లల పట్లతల్లిదండ్రులు అప్రమత్తతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబీకులకు అండగా ఉంటామని వారిలో భరోసా నింపారు. ఈ పరామర్శ కార్యక్రమలో నాయకులు రంగనాథ్,రాంబాబు,ఈశ్వర్ గౌడ్,ధీరజ్, శబరీష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

## పలమనేరులో ఘనంగాజరిగిన బక్రీద్ పండుగ
## ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 07:**
త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగని సాటి వారి కష్టాలను సామాజికంగా పంచుకోవ డమే పండుగ ఉద్దేశమని పలమనేరుశాస నసభ్యులు అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పలమనేరులో బక్రీద్ పండుగను మైనారిటీ సోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన బక్రీద్ వేడుకలలో ముస్లిం సోదరులతో కలసి ఎమ్మెల్యే ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు స్వీట్స్ తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాజా పీర్, చాంద్ బాషా, అమానుల్లా, మా భాష, ఇక్బాల్, షకీల్, మౌలా, నదీమ్, బాబాజాన్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ్మూర్తి ఘన సన్మానం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 07:**
అన్నమయ్యజిల్లా పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా బీసీలకు ఇవ్వడం, హర్షనీయమని తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంట్ ఈడిగ బిసి, సాధికార సమితి అధ్యక్షులు బుస్సా నాగరాజ గౌడ్ అన్నారు. చిత్తూరుజిల్లా గౌడసంఘం ఉపాధ్యక్షులు యాలపల్లి దీన్ దయాళ్, జిల్లా గౌడసంఘం యువసేనప్రధాన కార్యదర్శి వేపాకుల మురళిగౌడ్,పూతలపట్టు గౌడ సంఘం నాయకులు తుమ్మల నాగరాజ, మార్కెట్ కమిటీ కార్యాలయంలో పురం రామ్మూర్తిని వారు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడు తూ స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీ స్థాపించి రాజకీయాలకు ఆమడ దూరంలో నిలిచిన బీసీలకు పిలిచిఅవ కాశాలు ఇచ్చారని, అదేవిధంగా జనాభాలో అత్యధికంగా మెజార్టీలో ఉన్న బీసీలకు పక్షపాతిగా తెలుగు దేశం పార్టీ నిలిచిందని తెలుగుదేశం పార్టీజాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యా ప్తంగా బీసీల కు పెద్దపీట వేయడం హర్షణీయమన్నారు.

# రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

-మొదటిపేజీ తరువాయి

హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాలు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసింది. నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90 శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కారం నిరంతరం పనిచేసింది. కానీ నేడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే శీర్షిక ఎక్కడో పోయింది. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు. బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని ఇది. నిస్సిగ్గుగా రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, బీజేపీ నీళ్ల విషయంలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి హరీశ్‌రావు వివరంగా సమాచారం అందిస్తారు. గుజరాత్‌లో మార్బీ అనే ప్రాంతంలో ఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మంది చనిపోయినా ఏ ఎన్‌డీఎస్‌ఏ పోదు, ఏజెన్సీ పోదు. ఆ 140 మంది చావులకు ఫలానావాడు బాధ్యుడని ఏ ఏజెన్సీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడదు. బీహార్‌లో నాలుగు రోజులకి ఒక బ్రిడ్జి కూలిపోతున్నా అడిగే నాథుడు లేడు. అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయి రూ.100 కోట్లు నష్టం జరిగితే ఎన్‌డీఎస్‌ఏ రాదు, ఎవడు రాడు. అలానే అవినీతి, కమిషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిపోయి 8 మంది చనిపోయినా.. ప్రమాదం జరిగి 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉండే ఒక్క మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరు. ఎవరూ బాధ్యత



తీసుకునేవారు లేరు. అలాగే వట్టెం పంప్ హౌస్ మునిగిపోతే దాని గురించి మాట్లాడే వాళ్ళు లేరు, పెద్ద వాగు ప్రాజెక్ట్ రెండు సార్లు కొట్టుకు పోయినా అడిగేవాడు లేడు. కానీ కాళేశ్వరంలో 100 కాంపోనెంట్లు ఉంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాడు అంటే దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు రెండు రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టును వారి పార్టీ ఆఫీసులో తయారు చేశారు ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నం చేశారు. దానికి తిరుగులేని విధంగా ఎల్ అండ్ టీ సంస్థ ఎన్‌డీఎస్‌ఏ నివేదికను తిరస్కరిస్తున్నామని స్పష్టం చెప్పింది. అది చెత్తబుట్టలో పడేయడానికి తప్ప ఎందుకు పనికిరాదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని కట్టిన సంస్థ పనికిరానిదైతే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదే సంస్థతో ఎందుకు కట్టించావని రేవంత్ రెడ్డిని అడుగుతున్నా. కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా తెలంగాణ నుంచి పోయిన మూటలతో కట్టారని అందరికీ తెలుసు. వాస్తవాలు తెలియజెప్పడానికి, కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై నీళ్లిచ్చిన కేసీఆర్ మీద, నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్ ప్రభుత్వంపైన అభాండాలు వేసే ప్రయత్నం చేస్తున్నారు. కమిషన్ పేరుతో నాటకాలు ఆడుతున్న విషయంలో వాస్తవాలను బట్టబయలు చేయడానికే హరీశ్ రావును తానే కోరాను. ఈ పరంపరలో ఇది మొదటి మీటింగ్. డాలస్, లండన్‌లో చాలామంది ఎన్ఆర్ఐలు తమకు కూడా వివరాలు చెప్పాలని, మేము కూడా సోషల్ మీడియాలో చెప్తామన్నారు. ఈ విషయంలో ఒకడేమో బట్టకాల్చి మీదేస్తుంటే.. మరొకడేమో తానా అంటే తందానా అంటున్నడు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరు కలిసి తెలంగాణ బొండిగ పిసికే ప్రయత్నం చేస్తున్నరు. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన పనిని కావాలని అపవాదులు వచ్చేవిధంగా అనుమానాలు కలిగేలా ప్రచారం చేస్తున్నరు, వాస్తవాలు చెప్పాలని కోరారు. జిల్లాల్లో కూడా ఇలాంటి మీటింగ్‌లు ఏర్పాటు చేస్తాం. ఇది మొదటి ప్రయత్నం కాదు. ఇప్పటికే మేడిగడ్డం పోయాం. దానిని వెంటనే రిపేర్ చేయాలని, నీళ్లిచ్చే అవకాశం ఉన్నా ఇవ్వడం లేదని ఎన్‌డీఎస్‌ఏ యాక్ట్ కూడా చూపెట్టాం. ఓనరే రిపేర్ చేయాలని అందులో ఉంది. ప్రభుత్వం దానిని ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. రైతుల పొలాలను ఎండబెడుతున్నది. ఈ విషయంలో ప్రభుత్వం తన వైఖరిని చెప్పాలి. గోదావరి జలాల విషయంలో ఏపీ అనుమతుల్లేకుండా కడుతున్న ప్రాజెక్టు మీద ముఖ్యమంత్రి మాట్లాడడు, బీజేపీ కేంద్ర మంత్రులు మాట్లాడరు, కాంగ్రెస్ బీజేపీ వాళ్లు నోరు తెరవరు. అందుకే గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఏనాటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష.' అని కేటీఆర్ అన్నారు.

# కాంగ్రెస్‌లో కొత్త వర్సెస్ పాత

**హైదరాబాద్ :** అక్కడ నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు.. ఇక్కడ క్యాడర్‌లో కన్ఫ్యూజన్. కొత్త నేతలతో పాత నేతల లొల్లి.. వీటికి పరిష్కారం వెతకండి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరేలా కార్యాచరణ రూపొందించాలన్నారామె. గత పదిరోజులుగా తెలంగాణలో మకాం వేశారు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవ హారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్. పార్టీ నేతలతో మీనాక్షి వరుస సమీక్షలు నిర్వహించారు. వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలకు కొంతమంది అబ్జర్వర్స్‌ను నియమించి.. పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా మంతనాలు జరిపారు. వారి సమస్యలను, సూచనలను నోట్ చేసుకున్నారు జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మీనాక్షి ఆయనతో కీలక విషయాలను చర్చించారు. పదిరోజుల పాటు నేతలతో మాట్లాడిన విషయాలను వివరించారు. చాలా నియోజకవర్గాల్లో నేతలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఆధిపత్యపోరుతో పార్టీ క్యాడర్ ఇబ్బందులు పడుతున్నారని రేవంత్‌కు చెప్పారు మీనాక్షి. చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా టీమ్ బలహీనంగా ఉందన్నారు నటరాజన్. ప్రభుత్వ పథకాలను నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారన్నారామె. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపాలని రేవంత్‌కు తెలిపారు మీనాక్షి. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రతి నెలలో మొదటి, మూడవ శనివారం రోజున మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం కాకుండా ఉండేందుకే ఈ నిర్ణయమన్నారు సీఎం రేవంత్. మీనాక్షి నటరాజన్ సమీక్షల్లో చాలా మంది నేతలు జిల్లాలు, నియోజకవర్గాల్లో ఒక నేతపై మరొక నేత ఫిర్యాదులు చేసుకున్నారు. దాంతో పాటు ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాలు, నియోజకవర్గాల్లో నేతలు సోషల్ మీడియాలో చాలా వీక్‌గా ఉన్నారని, చాలా మందికి సోషల్ మీడియాపై అవగాహన లేదని, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవని, వాటిపై వారికి అవగాహన లేకపోవడంతో జనాలకు వివరించలేకపోతున్నారని మీనాక్షికి ఫిర్యాదులు అందాయి. అన్ని విషయాలను ఆమె సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపవలసిందిగా ఆమె సీఎంను కోరారు. అలాగే కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టాలని మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. వీటన్నింటికి సంబంధించిన విషయాలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా రెండుసార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించనుంది. 15 రోజులకోసారి




మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం లేకుండా వేగం పెంచాలని.. అందుకే రెండు మూడు నెలలకోసారి కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా కేబినేట్‌లో సమీక్ష చేయాలని నిర్ణయించారు. మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు వీలుగా రెండు వారాలకోసారి మంత్రి వర్గ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి నెలలో మొదటి, మూడవ శనివారం రోజున మంత్రివర్గ సమావేశం నిర్వహించేందుకు ఆలోచన చేస్తున్నారు. కాగా ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు 17 సార్లు కేబినేట్ భేటీలు జరిగాయి.

# వీ.కోటలో అమ్మ ఆక్ట్స్ మహిళ పరస్పర సహకార పొదుపుసంఘం

## 28వవార్షికోత్సవవేడుకలు

**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 07:**

చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గ వీకోటమండలం జిఎంఆర్ కళ్యాణ మండపంలో శనివారంరోజు ఏసిటిఎస్ పొదుపు సంఘంయొక్క 28వ వార్షికోత్సవాన్ని అతిబ్రహ్మాండంగా నిర్వహించినారు. ఆక్ట్స్ సమస్త సీఈవో గున్నమరెడ్డి దశరథరెడ్డి అధ్యక్షతన ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్ జి. శ్రీనివాసులు, పలమనేరు నియోజకవర్గం శాసనసభ్యులు మాజీ మంత్రి ఎన్. అమర్నాథ్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎమ్మె.ఎస్ చంద్రశేఖర్, పొదుపు సమస్తసభ్యులు, పొదుపు సంఘాలలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శాసన సభ్యులు అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ వి కోట ప్రాంతం ఒకప్పుడు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్న సమయంలో డాక్టర్ జి దశరథ రెడ్డి ఈ ప్రాం తంలో పొదుపు సంఘాలు ప్రారంభించి ప్రజలలో మహిళల్లో మంచి చైతన్యం తీసుకువచ్చి మహిళలను పొదుపు వైపు మళ్లించి వారిలో ఆర్థికంగా ముందుకు వెళ్లడానికి, ఉన్నత స్థానాల కు ఎదగడానికి తను వేసిన బాటలు శనివారం రోజు వారి పాలిట రహదారులై మహిళలు అన్నింటిలోనూ ముందు ఉన్నారని హితవు పలికినారు. ఈ సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాసి అత్యధిక మార్కుల తో ఉత్తీర్ణులైన విద్యార్థినీ,విద్యార్థులకు అమ్మ ఆక్ట్స్ స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున గోల్డ్ మెడల్‌తో సత్కరిస్తూ, ప్రతి సంవత్సరం ఇచ్చే నగదు బహుమతిని, ఈ సంవత్సరం కూడా, వచ్చిన అతిధుల చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు అందించడం అయినది.




అనంతరం ఈ సంవత్సరంలో జరిగినటువంటి లావాదే వీలు ఆస్తుల వివరాలను బహిరంగంగా ఖాతాదారు లకు, అధికారులకు తెలియ జేయడమైనది. ఈ సందర్భంగా వీకోట అర్బన్ పోలీస్ స్టేషన్ వలయాధికారి సోమశేఖర్ రెడ్డి సమావేశానికి విచ్చేసి సమస్త సీఈవో జి .దశరథ రెడ్డిని చాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించినారు. సోమశేఖర్ రెడ్డి సిఐ మాట్లాడుతూ దశరథరెడ్డి దాతృత్వంతో వీకోట పట్టణం మొత్తం సీసీ కెమెరాల నిఘాతో ఉందని ఇందుకు గాను సుమారు 8 లక్షల రూపాయలు వ్యయంతో పట్టణానికి కావలసిన సీసీ కెమెరాలు మరియు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పెద్ద సైజుతో కూడిన ఎల్ఈడి టీవీలను



సమకూర్చినా రని సభాముఖంగా తెలియజేసినారు. సర్వసభ్య సమావేశం ముగిసిన అనంతరం విచ్చేసిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, పొదుపు సంఘాల మహిళలకు అమ్మ ఆక్ట్స్ స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున భోజన వసతి ఏర్పాటు చేయడమైనది.

# కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుదాం..

-మొదటిపేజీ తరువాయి

వచ్చి ఏడాదైనా సందర్భంగా జూన్ 12వ తేదీన అమరావతిలో 2 వేలమందితో ఓ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ తర్వాత కూడా ఏపీవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు ఎవరెవరు ఏం చేస్తున్నారనే సమాచారం తన దగ్గర ఉందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నేతలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీలో ఉన్న పరిస్థితులు కూడా ప్రజలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 2024 జూన్‌కి ముందు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని గుర్తుచేశారు. తాను నాలుగోసారి సీఎం అయ్యానని.. కానీ ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదని వెల్లడించారు సీఎం చంద్రబాబు. అయినా ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. మనం రాష్ట్ర సంక్షేమం కోసం యజ్ఞం చేస్తుంటే రాక్షసులు కొంతమంది భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఏపీలో గతంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేదని.. ఇప్పుడు కంట్రోల్ చేస్తున్నామని అన్నారు. శాంతి భద్రతలు, గంజాయి, రౌడీయిజాన్ని నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తామని.. ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహానాడు ఈసారి బాగా జరిగిందని చెప్పారు. వచ్చే నెల నాటికి అన్ని కమిటీలు, రాష్ట్ర కమిటీలను నియామకం పూర్తి చేస్తామని తెలిపారు. యోగా డేను జయప్రదం చేయాలని కోరారు. కార్యకర్తలు యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# తెల్లగుండ్లపల్లిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**

వేదురుకుప్పం మండలం బోమ్మయపల్లి పంచాయతీ తెల్లగుండ్లపల్లి గ్రామంలో జాతర సందర్భంగా నూతన విద్యుత్ దీపాలను సర్పంచ్ గోవింద్ ఏర్పాటు చేశారు. గ్రామంలో గ్రామస్తులకి ఏ అవసరం ఉన్న వెంటనే పరిష్కరిస్తానని సర్పంచ్ గోవింద తెలిపారు.

# 5 లక్షల మందితో యోగా

-మొదటిపేజీ తరువాయి

ఈవెంట్ చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజును భారీ స్థాయిలో యోగా కార్యక్రమాలను చేపట్టనుంది. విశాఖలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్నాయి. ఒక్క విశాఖలోనే ఒకే రోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. యోగా మన జీవితంలో భాగం కావాలని? ఆయుష్ ద్వారా యోగాను ప్రతి ఒక్క ఇంటికి చేర్చేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. విశాఖపట్నంలోని ఆర్కె బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు జరిగే యోగా ప్రదర్శనలో భారీ ఎత్తున ప్రజలు భాగస్వాములవుతారని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రధాన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో 2 కోట్ల మందిని భాగస్వాములను చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే కోటిపైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి 2 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

**రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ఇలా?.**

యోగాంధ్ర కార్యక్రమంలో భాగమయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం ముందుగా వెబ్ సైట్ లోకి వెళ్లాలి. ఇక్కడ ఫామ్ అందుబాటులో ఉంటుంది. మీ వివరాలను నమోదు చేయాలి. జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్రమంలో ఎక్కడ పాల్గొంటారనేది సెలెక్ట్ చేయాలి. ఓటీపీ ప్రాసెస్ తర్వాత? రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

# ఆందోళనకరంగా ఏపీ ఆర్థిక పరిస్థితి.

**తాడేపల్లి:** చంద్రబాబు కూటమి పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారిందన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. కాగ్ నివేదికలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని వైఎస్ జగన్ తెలిపారు. కూటమి ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా కాగ్ నివేదికలను బయటపెట్టారు. వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారింది. కాగ్ నివేదికలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా రూ.3,354 కోట్లు ఉన్నట్లుగా ప్రభుత్వం ప్రకటన చేసింది. కానీ, ఇది అబద్ధమని కాగ్ నివేదిక వాస్తవ లెక్కలను ప్రకటించింది. 2024 ఏప్రిల్‌తో పోల్చితే 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆదాయం ఏకంగా 24.20 శాతం తగ్గింది. ఈ వాస్తవాలను కాగ్ నివేదిక బయట పెట్టగానే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించింది. ఏప్రిల్ విషయాలు చెప్పకుండా మే నెలలో జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో పెరుగుతాయంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. సర్దుబాటు కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.796 కోట్లు తగ్గిందనీ, అందువలన జీఎస్టీ ఆదాయాలు తగ్గాయని ప్రకటించింది. నిజానికి సర్దుబాట్లన్నీ లెక్కించిన తర్వాతనే నికర జీఎస్టీని లెక్కగడతారు. కానీ, జీఎస్టీ ఆదాయాల గురించి కాగ్ నిజాలను వెలుగులోకి తేగానే దాన్ని కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం ఇలాంటి ప్రకటనలను చేస్తోంది.

**కాగ్ నివేదికలను బయటపెట్టిన వైఎస్ జగన్**

టీడీపీ ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయి. దాన్ని బట్టి చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉంది. గతేడాదితో పోల్చితే పన్ను ఆదాయాలు 12.21 శాతం తగ్గాయి. పన్నేతర ఆదాయాలు 22.01 శాతం తగ్గాయి. ఇది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మరింత ఆందోళన కలిగించే అంశం' అని చెప్పుకొచ్చారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 07:**



త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండు గను ముస్లింసోదరులు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా కోటూరు దాచేపల్లి బుటకపల్లి తదితర గ్రామాలలో ముస్లింసోదరులు ఆయా ఈర్గాల వద్ద ప్రార్థనలు సహా పంక్తి భోజనాలు ఏర్పాటు చేసి హిందూ ముస్లింల సఖ్యతను చాటిచెప్పారు.

## బోయకొండలో జరిగే యోగా దినోత్సవం విజయవంతం చేద్దాం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 07:**
ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండగంగమ్మ ఆలయంసమీపంలో జరిగే యోగదినోత్స వాన్ని విజయవంతం చేద్దామని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 9న యోగాదినోత్సవం బోయకొండ గోశాలవద్ద జరిపేందుకు సన్నాహేలు పూర్తి చేశామ న్నారు. ఈ మేరకు శనివారం టూరిజం శాఖ అధికారినితోపాటు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ ఎస్సై నాగేశ్వర రావుతో కలిసి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి ఏర్పాట్ల ను పర్యవేక్షించారు తొమ్మిదిన ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య యోగాసనాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన ప్రదే శాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హనుమంతు ఎంపీడీవో లీల మాధవి మండలస్థాయి అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీకోట మండలంలో ఘనంగా బక్రీదు సంబరాలు.



**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్0 7:**
త్యాగాలకు ప్రతిరూపం బక్రీద్ పండుగని సాటివారి కష్టాలను సామాజికంగా పంచు కోవడమే ఈ పండగ ముఖ్య ఉద్దేశం అని ముస్లిం మత పెద్దలు మసీదుల వద్ద హిత బోధ చేసినారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని ఆనందోత్సవాల మధ్య నమాజులు చేసినారు.

## వివిధ పంటల్లో లాభనాంటి సాంగు కోసం సూచనలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 07:**



చౌడేపల్లి మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గసముద్రం రైతుసేవాకేంద్రంలో కలికిరి, కెవికె సమన్యాయకర్త డా.కె. మంజుల ఆధ్వర్యంలో ఐఫిల్ క్రిష్టి సభల్స్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయధికారి, వి.జ్యోతమ్మ మాట్లాడుతూ వేరుశనగలో అధిక దిగుబడుల కోసం పాటించాల్సిన పద్ధతులైన విత్తిన మోలాడు, విత్తనశుద్ధి,కలుపు నివారణ, యూరియా, సింగిల్ సూపర్ ఫాస్పేట్, పొటాష్, జిప్సంయొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పీరు సాహిల్ ప్రష్టరక్షణ విభాగు శాస్త్రవేత్త కెవో) రైతులు అరిగిన టమోటలో వదేలు తిగులు నివారణ చర్యలు వివరించారు. వర్షలు తెగులు నివారణగా ట్రైకొరమ్మ 2 కిలోలు మరియ 100 కిలల పశువుల ఎరువులో గలిసి ఆఖరి దుక్కులో వేయాలని, పంట దశలో వున్నపుడు ట్రైకోడర్మాఆ? 200 లీ. నీటిలో కలిపి మొక్క మదళ్ళు తరిచే టట్లు పాయలని సంచించారు. పట్టు పరుసల రమణ (ట్రPCల్ అసిస్టెంట్, సెరికల్చర్, చౌడేపల్లి సరికతకం మీకంలో రైతులకు ప్రభుత్వం ఇమ్మేటువంటి పసకాలు వివరించారు. కార్యక్ర మంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయికి క్రెడిట్ అవగాహన.. సిబిల్, సా-ధన్ కొత్త కార్యక్రమం!

దేశంలో ఆర్థిక అవగాహనను పెంచేందుకు, బాధ్యతాయుత రుణ విధానాలను ప్రోత్సహించేందుకు ఒక ముఖ్య అడుగు పడింది. క్రెడిట్ సమాచారంలో అగ్రగామి సంస్థ ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సూక్ష్మ రుణ సంస్థల అపెక్స్ బాడీ సా-ధన్ కలిసి పని చేయనున్నాయి. దేశవ్యాప్తంగా రుణాలపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా, రుణదాతలు, చిన్న మొత్తంలో అప్పు తీసుకునేవారికి ఆర్థిక విషయాలపై పట్టు పెంచడమే ఈ భాగస్వామ్యం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని ఆయా సంస్థలు ప్రకటించాయి. ఈ సహకారం వల్ల చిన్న రుణ సంస్థల రుణ మూల్యాంకనం, పర్యవేక్షణ సామర్థ్యాలు మెరుగుపడతాయి. డేటా ఆధారిత విశ్లేషణలు, అధునాతన సాధనాలు, ప్రత్యేక శిక్షణల ద్వారా చిన్న రుణ సంస్థలను బలోపేతం చేయనున్నారు. దీనివల్ల ఆర్థిక సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. బాధ్యతాయుతమైన రుణ పంపిణీకి ప్రోత్సాహం లభిస్తుంది. ఈ అవగాహన కార్యక్రమం దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరేలా పలు భాషల్లో డిజిటల్ సమాచారం రూపొందించారు. కమ్యూనిటీ ఆధారిత విధానాన్ని అనుసరించి, చిన్న రుణ సంస్థలు తమ ఖాతాదారులకు రుణాలపై సరైన అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. తద్వారా, బాధ్యతాయుతమైన క్రెడిట్ అలవాట్లు పెంపొందుతాయి. ఆర్థిక సేవలు తగినంతగా అందుబాటులో లేని ప్రాంతాల్లో ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న సా-ధన్ సంస్థకు 230కి పైగా సూక్ష్మ రుణ సంస్థలు, బ్యాంకులు సభ్యులుగా ఉన్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సా-ధన్ కలిసి



ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాయి. క్రెడిట్ స్కోర్ ప్రాముఖ్యత, డేటా వినియోగం, పటిష్టమైన రుణ వ్యవస్థ నిర్మాణం వంటి అంశాలపై చిన్న రుణ సంస్థలకు, వారి బృందాలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా మాడ్యూల్స్ రూపొందిస్తాయి. ట్రాన్స్‌యూని యన్ సిబిల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ భవేష్ జైన్ మాట్లాడుతూ.. "రుణాలపై అవగాహన కేవలం అప్పు తీసుకోవడానికి మాత్రమే కాదు. ఆర్థిక ప్రపంచంలో నమ్మకాన్ని, విశ్వసనీయతను పెంచుకోవడానికి ఇది కీలకం. డిసెంబర్ 2024 నాటికి 13 కోట్ల మంది తమ సిబిల్ రిపోర్ట్, స్కోర్‌ను పరిశీలించారు. ఇది క్రెడిట్ గురించి ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనం. ఈ భాగస్వామ్యం ద్వారా, చిన్న రుణ సంస్థలు, వారి ఖాతాదారులకు ఆర్థికంగా మరింత మెరుగైన భవిష్యత్తును అందించాలని మేము ఆశిస్తున్నాం" అని తెలిపారు.

# వడ్డీ రేట్లు అర శాతం తగ్గింపు

రిజర్వ్ బ్యాంక్ వరుసగా మూడోసారి వడ్డీ రేట్లకు కోత విధించింది. మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్షలో కీలక రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా 5.50 శాతానికి చేర్చింది. ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్లు చొప్పున వడ్డీ రేట్లను తగ్గించింది. మొత్తంగా రుణాలపై వడ్డీ ఒక్క శాతం మేర కోత విధించడంతో పాత, కొత్త గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణగ్రహీతలపై వడ్డీ భారం కొంత తగ్గనుంది. ఆర్‌బిఐ ఎంపీసీ భేటీ తర్వాత శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజరు మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణం స్థిరంగా తగ్గుతోందన్నారు. ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జీడీపీ 6.5 శాతం పెరగొచ్చున్నారు. పెట్టుబడిదారులకు అపార అవకాశా




లు కల్పిస్తోందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ అంచనాలను 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గిస్తున్నామన్నారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్టు మల్హోత్రా తెలిపారు. మరోవైపు బ్యాంక్‌ల వద్ద నగదు లభ్యతను పెంచడానికి నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ను 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో సీఆర్ఆర్ 4 శాతం నుంచి 3 శాతనికి తగ్గనుంది. దీన్ని సెప్టెంబర్ నుంచి 25 బేసిస్ పాయింట్ల చొప్పున నాలుగు విడతలుగా అమలు చేయనున్నట్టు తెలిపింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలోకి దాదాపు రూ. 2.5 లక్షల కోట్లు నగదు లభ్యతను పెంచనుందని అంచనా వేసింది. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్టవుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ.9.5 లక్షల కోట్లు ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చామని మల్హోత్రా తెలిపారు. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయన్నారు. దీంతో మరో 11 నెలల వరకు దిగుమతులకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ దఫా వడ్డీ రేట్లలో పావు శాతం తగ్గింపు ఉండొొచ్చని నిపుణులు అంచనా వేయగా.. ఎస్‌బీఐ మాత్రం అర శాతం కోత ఉండొొచ్చని ముందస్తు భావించడం విశేషం.

# కొత్త నాయకుడికి తొలి సవాల్.. ఇంగ్లండ్ చేరుకున్న భారత జట్టు

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సైకిల్(2025-27) తొలి సిరీస్ కోసం భారత జట్టు ఇంగ్లండ్ చేరుకుంది. శుక్రవారం రాత్రి మీడియా సమావేశం అనంతరం హెడ్‌కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు టీమిండియా బృందం ముంబైలో లండన్ విమానం ఎక్కింది. సుదీర్ఘ ప్రయాణం అనంతరం శనివారం భారత ఆటగాళ్లు ఇంగ్లండ్‌లో అడుగుపెట్టారు. 5 టెస్టుల సిరీస్ కోసం భారత బృందం ఇంగ్లండ్‌లో కాలు మోపింది అంటూ బీసీసీఐ ఎక్స్ ఖాతాలో వీడియో పోస్ట్ చేసింది. దేశవాళీ, ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన సాయి సుదర్శన్ ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై కూడా చెలరేగి ఆడాలనుకుంటున్న ఈ చిచ్చరపిడుగు సిరీస్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. భారత జట్టులో అది కూడా టెస్టు ఆటగాడిగా ఎంపిక కావడం నిజంగా చాలా గొప్ప విషయం. లండన్‌లోకి స్వాగతం పలుకుతున్నా సుదర్శన్ బీసీసీఐ పోస్ట్ చేసిన వీడియోలో అన్నాడీ యువకెరటం. సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్‌ల గైర్హాజరీలో తొలిసారి భారత జట్టు విదేశీ పర్యటనకు వెళ్లింది. ఇక కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే మొదటి సిరీస్. సో.. నాయకుడిగా తనను తాను నిరూపించుకునేందుకు అతడికి ఇదొక అవకాశం. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ప్లే ఆఫ్స్ తీసుకుకెళ్లిన ఈ యంగ్ కెప్టెన్.. ఇప్పుడు కోట్లాది మంది ఆశల్ని మోస్తూ ఇంగ్లండ్‌లో 'శభాష్ గిల్' అనిపించుకోవాలనే ఆలోచనతో ఉన్నాడు. అతడికి అన్నివిధాలా అండగా కోచ్



గంభీర్ ఉండనే ఉన్నాడు. వీళ్ల కాంబినేషన్‌లో భారత జట్టు సిరీస్ కైవసం చేసుకుంటుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఇంగ్లండ్, భారత జట్లకు ఇదే మొట్ట మొదటి సిరీస్. జూన్ 20 లీడ్స్ వేదికగా తొలి మ్యాచ్ జరుగనుంది. కాబట్టి.. ఇరు టీమ్‌లు విజయం కోసం గట్టిగానే పోరాడనున్నాయి. బర్మింగ్‌హమ్‌లో జూలై 2న రెండో మ్యాచ్, లార్డ్స్‌లో జూలై 10న మూడో టెస్టు, మాంచెస్టర్‌లో జూలై 23 నాలుగో మ్యాచ్, ఓవల్‌లో ఆగస్ట్ 4న ఐదో టెస్టులో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి.

## బెంగళూరు తొక్కిసలాట.. విరాట్ కోహ్లీపై పోలీసులకు ఫిర్యాదు

ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా బెంగళూరులో బుధవారం జరిగిన తొక్కిసలాట ఘటనతో స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ చిక్కుల్లో పడ్డారు. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ కోహ్లీపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయి. శివమొగ్గ జిల్లాకు చెందిన హెచ్‌ఎమ్ వెంకటేశ్ అనే వ్యక్తి కబ్బన్ పోలీసు స్టేషన్‌లో కోహ్లీపై ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే రిజిస్టరైన కేసులో భాగంగా ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 18 ఏండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పును ముద్దాడింది. ఈ




సందర్భంగా బుధవారం బెంగళూరులో ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 47 మందికిపైగా గాయపడ్డారు. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఘటన నేపథ్యంలో ఆర్‌సీబీ జట్టు స్టార్ ఆటగాడైన విరాట్ కోహ్లీ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తొక్కిసలాటకు భాద్యుడిగా కోహ్లీని అరెస్ట్ చేయాలని సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ArrestKohliని నెటిజన్లు విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.

## స్పోర్ట్స్

## జోస్ బట్లర్ విధ్వంసం.. విండీస్‌ను చిత్తు చేసిన ఇంగ్లండ్




వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. చెస్టర్-లె-స్ట్రీట్ వేదికగా జరిగిన తొలి టీ20లో 21 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లీష్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ జోస్ బట్లర్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన బట్లర్.. విండీస్ బౌలర్లను ఊతికారేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 59 బంతులు మాత్రమే ఎదుర్కొన్న బట్లర్.. 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 96 పరుగులు చేశాడు. అతడితో పాటు యువ ఓపెనర్ జేమీ స్మిత్(38), జాకబ్ బెతల్(23) రాణించారు. విండీస్ బౌలర్లలో షెఫర్డ్ రెండు వికెట్లు పడగొట్టగా.. జోషఫ్, రస్సెల్, ఛేజ్ తలా వికెట్ సాధించారు.

**తిప్పేసిన డాసన్..**

అనంతరం లక్ష్య చేధనలో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 167 పరుగులకే పరిమితమైంది. ఇంగ్లండ్ స్పిన్నర్ లియామ్ డాసన్ ధాటికి కరేబియన్ బ్యాటర్లు విల్లవిల్లాడారు. డాసన్ నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును దెబ్బతీశాడు. అతడితో పాటు జాకబ్ బెతల్, మాథ్యూ పాట్స్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక విండీస్ ఇన్నింగ్స్‌లో ఎవిన్ లూయిస్(39) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో టీ20 బ్రిస్టల్ వేదికగా ఆదివారం జరగనుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143